ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
కర్ణాటక వార్తలు
సోమవారం 7 అక్టోబరు 2024



## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**హిందూపురం, అక్టోబరు 6 :** అనుమానాస్పద స్థితిలో కర్ణాటకకు చెందిన వ్యక్తి హిందూపురం సమీపంలోని కొట్నూరువద్ద ఆదివారం మృతి చెందారు. వన్‌టౌన్ ఏఎస్ఐ ఆదినారాయణ తెలిపిన వివరాల మేరకు చిత్రదుర్గం జిల్లా గంజిగెర గ్రామానికి చెందిన ఎరుకల లోకేష్(46)తోపాటు మరో ఇద్దరు వారం రోజులుగా హిందూపురం ప్రాంతంలో తిరుగుతున్నారు. అయితే శనివారం రాత్రి శిర-కొడికొండ చెక్‌పోస్టు జాతీయరహదారి సింగిరెడ్డిపల్లి క్రాస్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో లోకేష్ మృతదేహం పడి ఉంది. ఇతను కర్ణాటకలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



నీటిలో కారును తీసుకెళ్తున్న స్థానికులు



నగరంలోని కేంద్రీయవిహార్ అపార్ట్‌మెంట్ వాసులను ట్రాక్టర్‌లో తరలిస్తున్న పోలీసులు

- భారీ వర్షానికి బెంగళూరు కాలనీలు అస్తవ్యస్తం
- జలమయమైన పలు ప్రాంతాలు.. కూలిన మిద్దెలు
- రాష్ట్రవ్యాప్తంగా వాన జోరు ● 12 జిల్లాల్లో ఎల్లో అలర్ట్

# ముంచేసింది..!



జలమయమైన సెల్లార్

**బెంగళూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):** బెంగళూరు నగరాన్ని భారీ వర్షం ముంచేసింది. శనివారం సాయంత్రం ప్రారంభమైన వర్షం ఆదివారం తెల్లవారేదాకా కురవడంతో పలు ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. సుమారు 15కుపైగా భారీ వృక్షాలు నేల కూలాయి. 44 ప్రాంతాల్లో కొమ్మలు విరిగి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పశ్చిమ విభాగంలోని పార్క్‌వ్యూ అపార్ట్‌మెంట్‌లో 7 అడుగుల ఎత్తైన సుమారు 10 అడుగుల మేర ప్రహరీ కూలిపోయింది. బిన్నిమిల్ ప్రాంతంలోని ఇటామాల్ వెనుకభాగాన ప్రహరీ కూలిపోవడంతో ప్రజా సంచారానికి ఇబ్బంది ఏర్పడింది. కొన్నిచోట్ల ద్విచక్రవాహనాలు నీటిలో కొట్టుకుపోగా జేసీబీలతో వెలికితీశారు.

### నగరం జలమయం..

భారీ వర్షంతో నగరం జలమయంగా మారింది. యలహంకలోని కేంద్రీయ విహార అపార్ట్‌మెంట్‌లో 50 అడుగుల కాంపౌండ్‌వాల్ కూలిపోయింది. యలహంక చెరువు, ఖాళీ ప్రదేశంలో నిల్వ ఉండే నీరు అపార్ట్‌మెంట్‌లోకి రావడంతో అక్కడి ప్రజలు ఇబ్బంది పడ్డారు. సెల్లార్‌లో నాలుగు అడుగులకుపైగా నీరు నిలిచింది. మహానగర పాలికెకు చెందిన గ్యాంగ్‌మెన్‌లు, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపకశాఖ అధికారులు సంయుక్తంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. యలహంక చెరువుకు చుట్టుపక్కలనుంచి పది చెరువుల నీరు చేరుతుంది. యలహంక చెరువు నుంచి జక్కూరు చెరువుకు నీరు వెళ్లే మార్గంలో లోతట్టులో అపార్ట్‌మెంట్ ఉండడం, ప్రహరీ కూలిపోవడంతో సమస్య నెలకొంది. అపార్ట్‌మెంట్‌లో నివసించేవారికి ఆదివారం



నీరు, ఆహారాన్ని సమకూర్చారు. దక్షిణ విభాగం విజయనగర మనువన వద్ద రాజకాలువలో శానిటరీ లైన్ పొంగిపొర్లింది. దీంతో పది ఇళ్లలోకి నీరు చేరింది. సెల్లార్‌లలో ఆగిన నీటిని ప్రత్యేకంగా పంపింగ్ చేస్తూ బయటకు పంపే ప్రక్రియ కొనసాగుతోంది. కాగా మరో ఐదు రోజులు వర్షం కురిసే అవకాశాలున్నాయని అధికారులు ప్రకటించించడంతో జనం బెంబేలెత్తుతున్నారు.

### నెటిజన్ల ఎద్దేవా...

వారాంతంలో సరదాగా గడపాలని భావించిన బెంగళూరు ప్రజలు శనివారం రాత్రి గంటల తరబడి రోడ్లపైనే పడిగాపులు గాశారు. నగరవ్యాప్తంగా ట్రాఫిక్ స్తంభించింది. చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం అయ్యాయని, అండర్‌పాస్‌లు, ఫ్లై ఓవర్‌లపైనా నీరు నదిలా ప్రవహించిందని ఇదేనా బ్రాండ్ బెంగళూరు అంటూ ఎద్దేవా చేస్తూ నెటిజెన్‌లు డీసీఎం డీకే శివకుమార్‌ను ట్యాగ్ చేశారు.



బిన్నిపేటలో కూలిన ఇళ్లు

### రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షం నమోదయ్యింది. పలు ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. దావణగెరె జిల్లా చన్నగిరిలో వర్షం ధాటికి వృద్ధుడు మృతి చెందాడు. తీర ప్రాంత, మలెనాడు ప్రాంతంలో భారీ వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. రామనగరలో 110 మిమీ, బెంగళూరు బసవేశ్వరనగర్‌లో 109.5 మిమీ, నాగపురలో 104, హంపినగరలో 102 మిమీ, బెంగళూరు వ్యాప్తంగా 113 మిమీ వర్షం నమోదైనట్లు వాతావరణ పరిశోధన శాఖ అధికారులు ప్రకటించారు. మండ్యలో 87, కోలారులో 84, బెంగళూరు గ్రామీణ జిల్లాలో 74, ఉడుపిలో 69, ధారవాడలో 67, దక్షిణకన్నడ, చామరాజనగరలలో 66, హాసన్‌లో 64, కొడగులో 77 మిమీ వర్షం కురవగా విజయపురలో అత్యల్పంగా 20మిమీ వర్షం కురిసింది. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించగా 12 జిల్లాల్లో ఎల్లో అలర్ట్‌ను ప్రకటించారు.



బిన్నిమిల్ ప్రాంతంలో వర్షపునీటిలో కొట్టుకుపోయిన ద్విచక్రవాహనం వెలికితీత ఇలా..



కూడ్లిగి వద్ద చెరువును తలపిస్తున్న పొలాలు

# రైతు కష్టం నీటిపాలు

- భారీ వర్షాలతో నీటమునిగిన పంటలు
- మిరప, పత్తి, పండ్లు, పూల తోటలకు కోలుకోలేని దెబ్బ

**బళ్లారి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):** చేతికొచ్చిన పంట నీటిపాలయ్యింది. జిల్లాల్లో మరో నెల రోజుల్లో పంటలు కోతకొస్తాయి. ఇప్పటి వరకు కంటికి రెప్పలా పంటను కాపాడుకున్న అన్నదాతకు కన్నీరే మిగిలింది. చేతికొచ్చిన పంట నేలపాలై నీటిమునిగిపోవడంతో రైతు ఆవేదన వర్ణనాతీతంగా మారింది. కల్యాణ కర్ణాటక జిల్లాలైన బళ్లారి, విజయనగర, కొప్పళ, రాయచూరు, కలబురగి జిల్లాల్లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రైతులు మిరప, పత్తి, వరి తదితర పంటలు విరివిగా సాగు చేశారు. శనివారం రాత్రంతా జోరు వాన కురిసింది. 186 మి.మీల వాన కురిసినట్లు అధికారులు పేర్కొన్నారు. కూడ్లిగి, హగరిబొమ్మనహళ్, హడగలి, విజయనగర, కంప్లి, బళ్లారి, జిల్లాల్లో అధికంగా పంట నీట మునిగింది. కూడ్లిగి తాలూకాలో 500 ఎకరాల వరకూ మిరప పంట నీటమునిగి పోయింది. హగరిబొమ్మనహళ్, సండూరులో పూలతోటలు, ఇతర పంటలు మునిగిపోయాయి. సండూరు తాలూకా వడ్డు, ఇతర ప్రాంతాల్లో జొన్న. సజ్జ, మిరప పంటలు నీటి ఉధృతికి నేలకొరిగిపోయాయి. సిరుగుప్ప, కంప్లి, గంగావతి, కారటగి ప్రాంతాల్లో పంటలు నీట మునగడంతో పాటు విద్యుత్తు స్తంభాలు నేల కూలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. గంగావతి, కుష్టిగి, రామనగర్, కృష్ణానగర్ క్యాంపుల్లో వరి పంట తీవ్రంగా దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వడ్డు వద్ద నేలకొరిగిన పంటను చూపుతున్న రైతు వెంకటేష్

- సండూరు తాలూకా వడ్డు గ్రామం వద్ద రైతు సాగు చేసిన పంట పూర్తిగా నేలవాలిపోవడంతో రైతుల ఆవేదన అంతా ఇంత కాదు, చేతికి వచ్చిన పంట నోటికి రాకుండా పోయిందని రైతు సంజప్ప ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చే వేళ పంటలు ఇలా నీటిపాలు కావడంతో తీవ్రంగా నష్టపోయానని వాపోయారు. ప్రభుత్వం తగిన సాయం అందజేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

### పంట నష్టాన్ని అంచనా వేస్తున్నాం: మల్లికార్జున, జేడీ

భారీ వర్షం కారణంగా జరిగిన పంట నష్టంపై అంచనా వేస్తున్నాం. పాక్షికంగా, పూర్తిగా నష్టపోయిన పంటల వివరాలను లెక్క కట్టి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం. పత్తి, మిరప, వరి పంటల లతో పాటు హార్టికల్చర్ పంటలు, ఉద్యాన పంటలు అధికంగా దెబ్బతిన్నాం. అన్నింటినీ పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తాం.



హడగలి బొమ్మనహళ్ వద్ద నీటమునిగిన ఉద్యాన పంటలు




## నాయకత్వ మార్పు తప్పదా..?

- రాష్ట్రంలో సీఎం మార్పునకే అధిష్ఠానం కసరత్తు ● తిప్పికొట్టేందుకు సిద్ధూ వ్యూహం ● దళితుల కార్డుతో డీకేకు చెక్ ● సతీష్ జార్కిహొళికే మద్దతు..!

**బెంగళూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):** ముడా ఇంటి స్థలాల వివాదం, వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తీరని మచ్చ ఏర్పడిందని అధిష్ఠానం భావిస్తోంది. రాజకీయ చరిత్రలో అవినీతి ఆరోపణ లేని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మెడకు 'ముడా' వివాదం చుట్టుకుంది. ముడా వివాదంలో తాను ఎలాంటి తప్పు చేయలేదని సీఎం సిద్దరామయ్య నిత్యం ఖండిస్తూనే ఉన్నారు. బీజేపీ అబద్ధాల ఆరోపణలు చేస్తోందని మండిపడుతున్నారు. అయినా సిద్దరామయ్య రాజకీయ ప్రాబల్యంపై ముడా కోలుకోలేని దెబ్బ తీసిందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో వివాదం ఏదైనా అవినీతి అంశమైనా, బహిరంగంగా సవాల్ విసిరే సిద్దరామయ్య 'ముడా' వివాదం వెలుగులోకి వచ్చాక ఆచితూచి మాట్లాడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే లోకాయుక్త ఏ1గా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జోక్యంతో మరిన్ని సమస్యలు తప్పవనిపిస్తోంది. సిద్దరామయ్యకు అండగా ఉన్నామని అధిష్ఠానం చెబుతున్నా అంతర్గతంగా నాయకత్వ మార్పుపైనా ఆలోచనలున్నట్లు తెలుస్తోంది. దీంతో సిద్దరామయ్య కూడా అప్రమత్తమై సరికొత్త వ్యూహాలకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. కేబినెట్‌లోని ఆప్తులైన ఇద్దరు మంత్రుల ద్వారా పేరు ప్రతిపాదనకు కార్యాచరణ చేసినట్లు తెలుస్తోంది. తద్వారా ముఖ్యమంత్రి పదవికి డీకే శివకుమార్‌కు అవకాశం లేకుండా కట్టడి చేయాలనే దే వ్యూహంగా తెలుస్తోంది. ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయరాదని ఆదేశించారు. సిద్దరామయ్య ప్రతిష్ఠను దెబ్బతీయడంతోపాటు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించాలనేది బీజేపీ ఉద్దేశమన్నారు. ఎవరైనా ఏ హోదాలోనైనా ఉండవచ్చునని, రేపు మార్పు జరగవచ్చునని కానీ పార్టీ మనుగడ ముఖ్యమనే వ్యాఖ్యల ద్వారా నాయకత్వ మార్పు తప్పదనే సంకేతాలను ఆయన పరోక్షంగా ఇచ్చినట్టయింది.

### పోటాపోటీగా ఢిల్లీకి నేతలు..




ఖర్గే వ్యాఖ్యల తర్వాత హోం మంత్రి పరమేశ్వర్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప, ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్‌జార్కిహొళిలు సిద్దరామయ్యతో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. 'అహింద' బృందంలో ఎస్సీ లేదా ఎస్టీ నాయకుడు ఒకరు సీఎం కావాలనే సందేశం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదే సమాచారాన్ని మంత్రి సతీశ్‌జార్కిహొళి ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేను భేటీ అయి వివరించినట్లు తెలుస్తోంది. అయితే అధిష్ఠానం వారి వినతిని నిరాకరించినట్లు సమాచారం. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ పార్టీ ముఖ్యమంత్రికి అండగా ఉందని, రాజీనామా అవసరం లేదని వ్యాఖ్యానించారు. నాయకత్వ మార్పు అనివార్యమైతే సిద్దరామయ్య సలహా తీసుకుని అధికార బదిలీ జరిపించాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు చర్చలు జరుగుతున్నాయి. హైకమాండ్ సిద్దరామయ్య సలహా తీసుకుంటే కాబోయే ముఖ్యమంత్రి సతీశ్‌జార్కిహొళి అవుతారని పార్టీ నేత ఒకరు అభిప్రాయపడ్డారు. దళితులు ఉన్నత హోదాకు ఇప్పుడు ప్రయత్నం చేయకుంటే మరోసారి అవకాశం లభించదని సిద్దరామయ్య అంగీకారంతోనే సభ జరిపినట్లు చర్చలు సాగుతున్నాయి. రెండు రోజుల క్రితం సిద్దరామయ్య సూచనతోనే సతీశ్ జార్కిహొళి ఢిల్లీ వెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడ తనకు 68మంది శాసనసభ్యుల బలం ఉందని, సిద్దరామయ్య రాజీనామా చేస్తే సీఎం అయ్యేందుకు అర్హుడని స్పష్టంగా వివరించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే ఖర్గేను కలసిన తర్వాత మీడియాతో మాట్లాడిన సతీశ్‌జార్కిహొళి రాజకీయ అంశాలు చర్చించామని, అయితే వాటిని బహిరంగ పరచలేమని తేల్చిచెప్పారు. పార్టీ నాయకత్వం కూడా సతీశ్‌జార్కిహొళి కూడా సుముఖత చూపాల్సి ఉంది. వెనుకబడినవర్గాలు ఆయనకు మద్దతునిస్తున్నాయి. ఇదే విధానం కొనసాగితే డీకే శివకుమార్‌ను రేసు నుంచి తప్పించవచ్చునని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కాగా శనివారం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ మంత్రి సతీశ్ జార్కిహొళి పార్టీ అధ్యక్షుడు ఖర్గేను కలవడంలో తప్పేమీ లేదని, మా అధ్యక్షులను మేం కలుస్తామన్నారు. నేను ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి భేటీ అవుతానని, ప్రతిరోజూ పార్టీకి సంబంధించిన ప్రగతిని వివరిస్తానన్నారు. దసరా ముగియగానే ఈనెల 15న ఏఐసీసీ కీలక నేత వేణుగోపాల్ రాష్ట్రపర్యటనకు రానుండడం మరింత చర్చలకు దారి తీసింది.



### కుల గణనతో ప్రభుత్వం కూలితే ఓకే : బీకే హరిప్రసాద్



కులగణన నివేదికను ప్రభుత్వం ఆమోదించే విషయమై అనుకూల, వ్యతిరేకమైన చర్చలు సాగుతున్నాయి. ఇదే సందర్భంలోనే ఆదివారం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ కులగణన ద్వారా ప్రభుత్వం కూలుతుందంటే.. ఓకే అదే జరగనీ...! అయినా అమలు చేయాల్సిందే అన్నారు. తొలుత కులగణన నివేదికను అమలు చేయాలని, అన్ని కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీలు కులగణన ప్రక్రియను ఎన్నికల మేనిఫెస్టోలోనూ ప్రకటించారన్నారు. అయితే డీసీఎం డీకే శివకుమార్ సోదరుడు, మాజీ ఎంపీ డీకే సురేశ్ స్పందిస్తూ కులగణన అమలుకు మరో ఏడాది వేచి ఉండడం ఉత్తమమని తిప్పికొట్టారు.



## శాకంబరీ.. శరణు.. శరణు

దసరా ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నగరంలో బనశంకరీదేవి అమ్మవారిని పలురకాల పండ్లతో అలంకరించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు.

7లో

## లొంగుబాటు దిశగా..!

- భారీ కూంబింగ్‌తో మారుతున్న మావోయిస్టుల ధోరణి ● తీర ప్రాంత వ్యక్తితో మధ్యవర్తిత్వం

**బెంగళూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):** ఉడుపి జిల్లా కార్కళ పరిధిలో ఆరుగురు మావోయిస్టులు లొంగిపోయేందుకు సిద్ధమయ్యారనే సమాచారం పశ్చిమ కనుమలలో హల్‌చల్ చేస్తోంది. నక్సల్స్ నేత విక్రమ్‌గౌడ నేతృత్వంలో వీరు లొంగిపోయేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. పశ్చిమకనుమల అటవీప్రాంతంలో ఇటీవల కొన్ని నెలలక్రిందట నక్సల్స్ తలదాచుకుంటున్నట్లు అనుమానాలు ఉన్నాయి. సరిహద్దులలోని పలు ఇళ్లకు వచ్చి ఆహార పదార్థాలు తీసుకెళ్లిన విషయం కూడా హల్‌చల్ చేసింది. దీంతో యాంటి నక్సల్ ఫోర్స్ (ఏఎన్ఎఫ్) నక్సల్స్ నియంత్రణ దళాలు ఈ ప్రాంతంలో నిరంతరంగా కూంబింగ్ కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వం గతంలో విడుదల చేసిన మావోయిస్టుల జాబితాలో 22మంది ఫొటోలను ప్రకటించింది. వీరిలో కొందరు ఎన్‌కౌంటర్‌కు బలికాగా మరికొందరు లొంగిపోయారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12మంది నక్సల్స్ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. వీరిలో 6-8మంది క్రియాశీలకంగా ఉన్నారని భావిస్తున్నారు. వీరిలో రాష్ట్రానికి చెందినవారితోపాటు ఇతరులు కూడా ఉన్నారు. కేరళ, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్ ప్రభుత్వాలు నక్సల్స్ నియంత్రణ కోసం భారీస్థాయిలో కార్యాచరణ అమలు చేస్తుండడంతో పాటు కేరళలో నక్సల్స్ గ్రూపులలో అంతర్గత భిన్నాభిప్రాయాలు తలెత్తినట్లు తెలుస్తోంది. దీంతోపాటు ప్రజలనుంచి కూడా క్షీణిస్తున్న తరుణంలో లొంగిపోవడమే సముచితమని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### రాష్ట్రంలో పలువురు లొంగుబాటు

రాష్ట్రంలో పలువురు నక్సల్స్ లొంగిపోయారు. వారికి ప్రభుత్వం ప్రత్యేకమైన ప్యాకేజీ ప్రకటించింది. 2010లో వెంకటేశ్, జయ, సరోజ, మల్లిక, 2014లో సిరిమనె నాగరాజ్, నూర్ జుల్ఫికర్, 2016లో భారతి, ఫాతీమ్, పద్మనాభ్, పరశురామ్, 2017లో కన్యాకుమారి, శివు, చన్నమ్మలు జిల్లా అధికారుల ఎదుట లొంగిపోయారు. మలెనాడు పశ్చిమకనుమల ప్రదేశంలో పేరొందిన బిజి కృష్ణమూర్తి, సావిత్రి అరెస్టు తర్వాత నక్సల్స్ ప్రభావం తగ్గిపోయింది. ఇలా పలు కారణాలతో ఆరుగురు లొంగిపోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### తీరప్రాంత వ్యక్తి మధ్యవర్తిత్వం


నక్సల్స్ లొంగిపోవడానికి, పునరావాస సౌలభ్యాలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో ఓ కమిటీని ప్రభుత్వం



రూపొందించింది. జనజీవన స్రవంతిలోకి తీసుకురావడమే కమిటీ ప్రధాన ఉద్దేశం. ఇలా తీరప్రాంతాలకు చెందిన ఓ వ్యక్తి మధ్యవర్తిత్వంతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే వివిధ కేటగిరీలలో లొంగిపోయిన నక్సల్స్‌కు 7.5 లక్షల రూపాయలదాకా పరిహారం ఉంటుం ది.

### లొంగిపోతే సంతోషమే: ఎస్పీ

మావోలు లొంగిపోయి జనజీవనస్రవంతిలోకి వస్తే సంతోషమేనని నక్సల్స్ నియంత్రణ దళం ఎస్పీ జితేంద్రకుమార్ దయామా అభిప్రాయపడ్డారు. లొంగిపోయారని, వారిపై ఉండే కేసులను రద్దు చేయలేమన్నారు. వాటిని ప్రత్యేకంగా పరిగణించి త్వరితగతిన పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. పరిహారంలో భాగంగా నగదుతోపాటు అన్ని సౌలభ్యాలు వర్తిస్తాయన్నారు. చట్టబద్ధంగా వారికి అవకాశం ఉంటుందన్నారు.



**తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు**

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1632.00 | 1,616.77 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 14,662 | 4,437 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 14,422 | 9,572 |
| సామర్థ్యం (టీఎంసీలు) | 101.77 | 52.74 |

# టీబీ డ్యాం ఆయకట్టులో పరుచుకున్న పచ్చదనం

● కాలువల్లో నిండుగా ప్రవహిస్తున్న నీరు

● రబీకి కూడా నీరు వదులుతామంటున్న అధికారులు

**బళ్లారి సిటీ, అక్టోబరు 6:** తుంగభద్ర జలాశయంలోకి ఈ ఏడాది ఖరీఫ్‌సీజన్ ప్రారంభం నుంచి గరిష్ట స్థాయిలో నీరు చేరడంతో ఆయకట్టు పరిధిలో వరిపంట విస్తారంగా నాటారు. డ్యాం కింద కాలువలకు నీరు సకాలంలోనే వదలడం వల్ల తుంగభద్ర ఆయకట్టులో సాగు చేసిన పంటలన్నీ పచ్చగా కళకళలాడుతున్నాయి. బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయనగరం జిల్లాల పరిధిలో దాదాపు 10లక్షల ఎకరాల్లో వివిధ పంటలకు ఎలాంటి నీటి సమస్య లేకపోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి పొట్ట దశకు చేరుకుంటుండగా, మొక్కజొన్న గింజ దశకుచేరుకుంటోంది. ప్రత్తి కూడా ఏపుగా పెరిగి విరబూస్తోంది. మిర్చి రైతలను తెగుళ్ల వెంటాడుతున్నప్పటికీ మందులు కొడుతూ పంటను గట్టెక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.



ఏపుగా పెరిగిన మొక్కజొన్న



కళకళలాడుతున్న వరిపంట

**తగ్గని ఇన్‌ఫ్లో**

జలాశయంలో ప్రస్తుతం 101టీఎంసీలకు నీరు తగ్గడం లేదు. ప్రతి రోజు 10వేల క్యూసెక్‌లకుపైగా ఇన్‌ఫ్లో వస్తోంది. జలాశయం నుంచి హెచ్‌ఎల్‌సీ,ఎల్‌ఎల్‌సీ,ఎల్‌బీఎంసీ తదితర కాలువలకు దాదాపు 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అయినా అంతే స్థాయిలో జలాశయంలోకి ఇన్‌ఫ్లో వస్తుండటం వల్ల ఖరీఫ్‌తో పాటు రబీ పంటను కూడా పండించుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. డ్యాంలో నీటి నిల్వ కూడా తగినంత ఉండే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది తుంగభద్ర 19వ క్రస్ట్‌గేటు కొట్టుకొని పోయినప్పటికీ అధికారులు, నిపుణులైన ఇంజనీర్లు, కార్మికులు శ్రమపడి క్రస్ట్‌గేటు స్థానంలో స్టాప్‌లాగ్ ఏర్పాటుచేయడంతో డ్యాంలో నీటి నిల్వ మళ్లీ 101టీఎంసీలకు చేరుకొంది. ప్రస్తుతం జలాశయం నిండుకుండలా పరవళ్లు తొక్కుతోంది. జలాశయానికి వస్తున్న ఇన్‌ఫ్లో దృష్ట్యా రబీ పంటకు కూడా తగినంత నీటి నిల్వ అందుబాటులో ఉంటుందని తుంగభద్ర బోర్డు అధికారులు అంటున్నారు.

## అధైర్యం వద్దు.. ఆదుకుంటాం

బాధితులకు ఎమ్మెల్యే భరత్‌రెడ్డి భరోసా



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**బళ్లారి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):** అధైర్యం చెందకుండా ఉండాలని ముంపు ప్రాంతాల ప్రజలకు బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం కురిసిన భారీ వర్షం కారణంగా నగరంలో లోతట్టు ప్రాంత కాలనీలో ఇళ్లు ముంపునకు గురయ్యాయి. ఆదివారం ఎమ్మెల్యే భరత్ 20వ వార్డు, మరో కొన్ని వార్డుల్లో పర్యటించారు. అక్కడ జనంతో మాట్లాడారు. ప్రభుత్వ పరంగా నష్ట పోయిన ప్రతి ఒక్కరికి పరిహారం అందిస్తామని పేర్కొన్నారు.

## సంప్రదాయాలను మరువరాదు

**కంప్లి, అక్టోబరు 6:** పిల్లలు మొబైల్, కంప్యూటర్ల మోజులో పడి దేశ సాంప్రదాయాలను మరువరాదని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. కంప్లి పట్టణంలో విశ్వకర్మ సమాజం వారు నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన పురాణ పఠనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు జరుపుకోవడం వల్లే గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందన్నారు. ఇప్పటికీ గ్రామాలు ఐక్యత, కలసికట్టుగా వుంటూ వారి ఐక్యతను చాటుకుంటున్నాయన్నారు. ప్రతి ఒక్కరు ధార్మిక, కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకుంటే ప్రశాంత జీవనం కొనసాగించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మౌనేష్ ఆచారి, రుద్రప్ప ఆచారి, రామచంద్రప్ప, విశ్వకర్మ సమాజ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడికి అభినందనలు



అధ్యక్షుడిని అభినందిస్తున్న శ్యామ్‌సుందర్

**బళ్లారి సిటీ, అక్టోబరు 6:** చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా నాగిరెడ్డి యశ్వంత్‌రాజ్ శనివారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన్ను కలిసిన స్వర్ణమహల్ యజమాని శ్యామ్‌సుందర్ వీరుగుప్త అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఆప్తుడైన యశ్వంత్‌రాజ్ సేవారంగంలో ఎల్లప్పుడు ముందుంటారని చాంబర్ ఆఫ్ కామర్స్ ఆయన ఆధ్వర్యంలో ఎన్నో విజయాలు సాధించాలని కోరుకుంటున్నానన్నారు. ఏపీఎంసీ మార్కెట్‌లో పలు సమస్యలపై దృష్టిసారించాలని ఆయన కోరారు. ఈసందర్భంగా శ్రీకర్, మేఘన పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సమీర్

**బళ్లారిరూరల్, అక్టోబరు 6 :** నగరంలో మరిస్వామి మఠం సమీపంలో ఇలాహి మసీద్ వద్ద డాక్టర్ సమీర్ నేతృత్వంలో పేద బడుగు బలహీన వర్గాలకు ఆదివారం ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 250 మందికిపైగా రోగులు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం శిబిరంలో దాదాపుగా 30 మంది దాకా రక్తదానం చేశారు. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి తమవంతుగా రక్తం అందుబాటులో వుంటుందని యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారు.

## గూడ్స్ షెడ్‌లో రైతులకు రెండువైపులా స్థలం కేటాయించాలి



మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న ఐనాథ్‌రెడ్డి

**బళ్లారి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):** బళ్లారి గూడ్స్ షెడ్‌లో రైతుల అవసరాలకు తగిన స్థలం కేటాయించాలని ఆదివారం మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి నివాసంలో రైల్వేశాఖ మంత్రి సోమన్నకు ఐనాథ్‌రెడ్డి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బళ్లారిజిల్లా తుంగభద్ర ఆనకట్ట పరిధిలో ఉందని జిల్లాలో అధిక సంఖ్యలో ప్రజలు వ్యవసా యంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వారు పండించిన పంటను ట్రాన్స్‌ఫోర్టు చేయాలంటేఇబ్బందిగా ఉందన్నారు. వ్యవసాయానికి సంబంధించిన ఎరువులు, విత్తనాలు, పండించిన పంట రవాణా కోసం గూడ్స్ షెడ్‌లో ట్రాక్‌కు రెండువైపులా స్థలం ఏర్పాటుచేయాలన్నారు. ప్రస్తుతం రైల్వే స్టేషన్‌లో ఒకేవైపు స్థలం ఉండటంతో ఈ ప్రాంత రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు.

## కుడితిని రైల్వే ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయాలి

**కంప్లి, అక్టోబరు 6:** కుడితిని రైల్వే ట్రాక్‌పై జరుగుతున్న ఫ్లైఓవర్ పనులను త్వరితగతిన పూర్తి చేసి కురుగోడు, కుడితినికి తిరిగే ప్రజలకు, రైతులకు, కార్మికులకు సమస్యలు తలెత్తకుండా చూడాలని కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నకు కుడితిని పట్టణానికి చెందిన గురుమూర్తి, వీరారెడ్డి, ఎలిగేరి పంపాపతిలు ఆదివారం వినతి పత్రం సమర్పించారు.

# రూ. 6,200 కోట్లతో రైల్వే అభివృద్ధి పనులు

● కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న

**బళ్లారి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):** బళ్లారి- హొస్పేట్ రైల్వే సెక్షన్ పరిధిలో రూ. 6.200 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న చెప్పారు. జిల్లా సమావేశ భవనంలో ఆదివారం వివిధ ప్రభుత్వ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బళ్లారి- చిక్‌జాజూరు మార్గంలో 185 కి.మీ పొడవునా రైల్వే ట్రాక్‌ను రూ. 3,080 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం ఆ పనుల సర్వే కూడా పూర్తి చేశామని వచ్చే రెండేళ్లలో ఈ పనులు పూర్తవుతాయన్నారు. స్వామిహళ్లి- రాయదుర్గం మార్గంలో 52 కిలో మీటర్ల వరకూ రైల్వే ట్రాక్ డబ్లింగ్ పనులకు సర్వే నిర్వహించామన్నారు. డీపీఆర్ రూపొందించి వాటిని పూర్తిచేస్తామన్నారు. బళ్లారి-హొస్పేట్ మార్గంలో నాలుగు ట్రాక్‌ల రైల్వే లైన్ నిర్మాణానికి సర్వే పనులు పూర్తి చేశామన్నారు. హొళ్లెలకెరె- అమరావతి కాలనీ వరకూ 20 కిలోమీటర్ల పొడవునా రైల్వే ట్రాక్ డబ్లింగ్ పనులు చేస్తున్నామన్నారు. తోరణగల్లు-రంజిత్‌పూర్ లైన్ 29కి.మీ డబ్లింగ్ పనులు చేస్తున్నామన్నారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ ప్రాజెక్టు కింద బళ్లారి రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం రూ.16.66 కోట్లు, హొస్పేట్ రైల్వే స్టేషన్ కు రూ. 15.17 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కర్ణాటకలో మొత్తం 21 రైల్వే స్టేషన్‌లో ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని తెలిపారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి సోమన్న

దేశంలోని 24 రాష్ట్రాల్లో 103 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయన్నారు. కర్నాటకలో 10 వందే భారత్ రైళ్లు వివిధ మార్గాల్లో తిరుగుతున్నాయన్నారు. పేద, మధ్యతరగతి ప్రయాణికులకు ఈ రైళ్ల ధరలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇక నుండి అన్నిరాష్ట్రాల్లోనూ వారి అధికార భాషకనుగుణంగా రైల్వే పరీక్షలు రాసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. బళ్లారి ఎమ్మెల్యే భరత్‌రెడ్డి మాట్లాడుతూ దుర్గమ్మగుడి వద్ద ఉండే రైల్వే అండర్ బ్రిడ్జి విస్తరణ పనులకు రూ.9 కోట్లు మంజూరు చేశారని కానీ ఇంత వరకూ నిధులు మంజూరు చేయలేదన్నారు. సమావేశంలో ఎంపీ తుకారాం. మేయర్ ముల్లంగి నందీష్ బాబు, సీఈవో రాహుల్ శరణప్ప, ఏడీసీ మహ్మద్ జుబేదా, రైల్వే అధికారి అజయ్ శర్మ, హుబ్లీ డీఆర్ఎం హర్ష ఖర్గే, బళ్లారి డి.డి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు సందీప్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆరుగురిని రక్షించిన అధికారులు



సరస్సులో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న అధికారులు

**తోరణగల్లు, అక్టోబరు 6 :** సండూరు తాలుకా తారానగర్ నారీహళ్లి సరస్సులో నీటిమట్టం పెరగడంతో ముందు జాగ్రత్త చర్యగా గేట్లు ఎత్తి నీరు వదిలారు. ఇందువలన నారీహళ్లి సరస్సు ఒడ్డునున్న బసాపురం కురేకుప్ప గ్రామాల చివరనున్న దాదాపు 200కు పైగా ఎకరాలలో ఉన్న పంటలు దెబ్బతిన్నాయి. అలాగే నీరు వస్తున్న విషయం తెలియని కురేకుప్ప గ్రామానికి చెందిన తిప్పయ్యస్వామి, తాయప్ప, రామాంజిని, వీరేష్, మరో ఇద్దరిని పోలీసు అధికారులు బోటు సహాయంతో రక్షించారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షులు కల్లుడప్ప, పంపన్న గౌడ అధికారులు పాల్గొన్నారు.

# త్రిపురసుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు



త్రిపురసుందరిగా ఆనెగొంది దుర్గాదేవి



సిరుగుప్ప తాయమ్మదేవికి త్రిపురసుందరి అలంకారం



బళ్లారి మల్లాడు దుర్గమ్మకు విశేష అలంకారం



విద్యుత్ దీపాలంకరణతో కాంతులీనుతున్న బళ్లారి కనక దుర్గమ్మ ఆలయం

శరన్నవరాత్రుల్లో భాగంగా నాలుగవరోజు ఆదివారం అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనం ఇచ్చారు. త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆనెగొంది దుర్గాదేవికి, కంప్లి మారెమ్మకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డులో వెలసిన శ్రీ తాయమ్మదేవిని ఆదివారం లలితా త్రిపుర సుందరిగా అలంకరించారు. కాళికా కముటేశ్వరాలయంలో కాళికాదేవికి పుష్పాలంకార సేవలు జరిపారు. బళ్లారి నగరంలోని అమ్మవారి ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. నగర దేవత కనకదుర్గమ్మ, కౌల్‌బజార్ పెద్దమతల్లి, మల్నాడు దుర్గమ్మ, ఏడుమక్కల తాయి, చిన్నదుర్గమ్మ, హవంబావి దుర్గాదేవి, రేడియోపార్కు పార్వతిదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరీ, వాసవీ మాతా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బళ్లారి కనకదుర్గమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో నయనమనోహరంగా అలంకరించారు. భక్తులందరికీ ప్రసాద వితరణ జరిగింది.

# హొసూరు జోన్

## అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన యువకులు

**హొసూరు(క్రైం) అక్టోబరు 6:** హొసూరు సమీపంలోని రాష్ట్ర సరిహద్దులో కర్ణాటక మద్యం ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు యువకులను సిప్‌కాట్ పోలీసులు అరెస్ట్‌చేశారు. హొసూరు జూజూవాడీ చెక్‌పోస్టుల్లో సిప్‌కాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీ చేస్తూ, అటుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులోఉన్న 125 కర్ణాటక మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకుని ఆ ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. విచారణలో గౌరీలాల్(30), జగన్నాథ్ కుమార్(22) ఇద్దరూ బీహార్‌కు చెందినవారని ప్రస్తుతం బేగేపల్లి ప్రాతంల్లో బస చేసినట్లు తెలిసింది. ఆ ప్రాంతంలోని ఓ కర్మాగారంలో పని చేస్తున్నట్లు వెల్లడైంది.

## 17 లక్షల బాణసంచా స్వాధీనం

**హొసూరు అక్టోబరు 6:** సిప్‌కాట్ సమీపంలోని ఓ గోడౌన్‌లో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన రూ.17 లక్షల బాణసంచా బాక్సులను ఏఎస్పీ నేతృత్వంల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బేగేపల్లి వీఏఓ గోపి సిప్‌కాట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, దీని ఆధారంగా ఏఎస్పీ అక్షయ్‌వాకర్ నేతృత్వంలో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. విరుదునగర్ జిల్లాకు చెందిన సెల్వకుమార్(39) ఓ ప్రైవేట్ గోడౌన్‌లో నిల్వ చేసిన క్రాకర్స్‌ను స్వాధీనం చేసుకుని సురక్షిత ప్రాంతానికి తరలించారు.

## ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి

**హొసూరు, అక్టోబరు 6:** నగరంలోని ఉపకార్ లేఅవుట్ ప్రాంతంలో సిప్‌కాట్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గ్రామ విజిలెన్స్ కమిటీ సమావేశం జరిగింది, హొసూరు కార్పొరేషన్ పరిసర ప్రాంతాల్లోని నివాస ప్రాంతాలకు పోలీసులు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా ఎస్పీ తంగదురై ఆదేశాల మేరకు హొసూరులోని ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు, కౌన్సిల్ ఇన్ స్పెక్టర్‌లతో పాటు పోలీసులు నివాసప్రాంతాలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హొసూరు సిప్‌కాట్‌లోని ఉపకార్ లే అవుట్ ప్రాంతంలోని వెయ్యికి పైగా నివాసాలు ఉండే ఈ ప్రాంతంలో గ్రామ అవగాహన కమిటీ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో సిప్‌కాట్ ఇన్‌స్పెక్టర్లు ప్రకాశ్ పాల్గొని మాట్లాడుతూ.. బయటకు వెళ్లినప్పుడు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. ప్రతి ఇంట్లో నిఘా కెమారాలు ఏర్పాటు చేయడం చాలావరకు శ్రేయస్కరమన్నారు. ఇంట్లో విలువైన వస్తువులను బ్యాంకు లాకర్‌లో ఉంచడం చాలామంచిదన్నారు. అలాగే ద్విచక్రవాహనాలపై ప్రయాణించేటప్పుడు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఆ ప్రాంతానికి చెందిన 100 మందికిపైగా సమావేశంలో పాల్గొన్నారు.



ఉపకార్ లే అవుట్ ప్రాంతంలో అవగాహన సమావేశం నిర్వహిస్తున్న పోలీసులు

# నారళ్ల ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

**కంప్లి, అక్టోబరు 6 :** షాద్ నగర్ వద్ద వుండే నారళ్ల జలాశయానికి శనివారం కురిసిన భారీవర్షానికి వరదనీరు పోటెత్తడంతో అధికారులు ఐదు గేట్ల ద్వారా వాగుకు నీరు విడుదల చేశారు. నారళ్ల ప్రాజెక్టు నుంచి కిందిభాగానికి నీరు వదలడంతో కిందిభాగంలోని దరోజీ చెరువు పూర్తిగా నిండి మరువ పారింది. కింది భాగంలో వుండే పంటలపై నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. సుమారు 30 నుంచి 35 రోజుల క్రితమే పంటలు నాటారు. తీరా అది చేతికొచ్చే సమయంలో పంటలు ఇలా నష్టం కావడంతో రైతన్నలు నిరాశకు గురయ్యారు. దరోజీ రైతు నాగరాజు మాట్లాడుతూ భారీఎత్తున దరోజీ చెరువు నుంచి నీరు రావడంతో నారళ్ల వాగు వద్ద వేసుకున్న వరి పంట పూర్తిగా నష్టపోయానన్నారు. చేతికొచ్చిన పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అధికారులను కోరారు.



ప్రాజెక్ట్ నుంచి నీరు కిందకు వెళుతున్న దృశ్యం

## రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటు చేయాలి

**రాయచూరు, అక్టోబరు 6:** విద్యాపరంగా అత్యంత వెనకబాటుతనానికి గురైన రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు చేసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఎయిమ్స్ స్థాపక ఏర్పాటు కోసం సాగిస్తున్న ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస అన్నారు. ఎయిమ్స్ ఏర్పాటుతోనే జిల్లాకు తగిన న్యాయం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎయిమ్స్ ఏర్పాటు కోసం అఖిల పక్షం, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్ష ఆదివారం 878వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ స్టేడియంలోని శిబిరం వద్ద ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస మాట్లాడుతూ, ఇప్పటికే జిల్లాకు ఐఐటీ ఇస్తామని చెప్పిన పాలకులు దాన్ని ఇతర జిల్లాకు తరలించడం జిల్లా ప్రజలను తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటుకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు ఏనాడు నోరు విప్పకపోవడం బాధ్యత రాహిత్యమన్నారు. ఈ ప్రాంత ప్రజల పట్ల వారికున్న నిబద్ధతను వారి మౌనం తెలియజేస్తుందన్నారు. నాయకులకు ఎన్నికల పట్ల ఉన్న ధ్యాస అభివృద్ధి పై లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. ప్రతిష్ఠాత్మకమైన జాతీయ స్థాయి విద్యసంస్థను రాయచూరులో ఏర్పాటు చేసి ఈ జిల్లాకు న్యాయం చేయాల్సిన పాలకులు కనీసం ఎయిమ్స్ ఏర్పాటు ద్వారా పేదరికం ఎక్కువగా ఉన్న ఈ జిల్లాలో వైద్య సేవలకు విస్తృత అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకోసం తమ పోరాటాన్ని పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలన్నారు.

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

### డీవీజీ (వర్ధంతి)



ఆధునిక కన్నడ సాహిత్యంలో తనదైనముద్రతో డీవీజీగా పేరొందిన దేవనహళ్ళి వెంకట రమణయ్య గుండప్ప 1887 మార్చి 17న జన్మించారు. రచయిత, కవి, పాత్రికేయుడిగానే కాక తత్వ వేత్తగా రాణించారు. ఆయన రచనలలో 'మంకు తిమ్మన కగ్గ' ఎంతో పేరొందింది. కన్నడ పత్రికలు భరత్, కర్ణాటకతోపాటు వారపత్రిక 'సుమతి'ని ప్రారంభించారు. భగవద్గీత తాత్పర్యాలపై రాసిన 'జీవన ధర్మయోగ'కు సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. ఆయన రచనలపై దాదాభాయ్ నౌరోజీ, గోపాలకృష్ణ గోఖలేల ప్రభావం అధికంగా ఉండది. 1975 అక్టోబరు 7న కన్నుమూశారు. 1988లో ఆయన స్మారక పోస్టల్‌స్టాంప్ విడుదలైంది.

### బేగం అక్తర్ (జయంతి)



గజల్ గాయని 'మల్లికా ఏ గజల్'గా పేరొందిన బేగం అక్తర్ 1914 అక్టోబరు 7న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫైజాబాద్ ప్రాంతంలో జన్మించారు. హిందూస్థానీ క్లాజికల్ మ్యూజిక్‌లో గజల్స్, దాద్రా, తుమ్రిల ఆలాపనలో పేరొందారు. చాలావరకు ఆమె తన పాటలకు తానే స్వరకల్పన చేసుకోవడం విశేషం. ఆలిండియో రేడియలో 400 దాకా పాటలు పాడిన ఘనత ఆమెది. 1930లో కొన్ని హిందీ సినిమాల్లో నటించడమే కాక తన సినిమాలకు తానే పాడారు. గాత్ర సంగీతంలో సంగీత నాటక అకాడమీ, పద్మశ్రీ తదితర పురస్కారాలు అందుకున్నారు. 1974 అక్టోబరు 30న కన్నుమూశారు. మరణానంతరం పద్మభూషణ్ ప్రకటించారు.

### వ్లాదిమిర్ పుతిన్ (పుట్టినరోజు)



వ్లాదిమిర్ పుతిన్ 1952 అక్టోబరు 7న సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జన్మించారు. రష్యా దేశ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. న్యాయవాదిగా పట్టా అందుకున్నాక లెఫ్టినెంట్ కల్నల్ హోదా (కమిటీ ఫర్ స్టేట్ సెక్యూరిటీ)లో దాకా చేరుకున్నారు. 2008లో రష్యాదేశ ప్రధానమంత్రి అయ్యారు. క్రీడలపై ఆసక్తితో మార్షల్ ఆర్ట్స్‌లోనూ ట్రైనింగ్ పొందారు. పలు దేశాల నుంచి ఆయన గౌరవ పురస్కారాలు, డాక్టరేట్ అందుకున్నారు. సెకండ్ లాంగెస్ట్ యూరోపియన్ ప్రెసిడెంట్‌గా గుర్తింపు పొందారు.

### సంగీతా కట్టి కులకర్ణి (పుట్టినరోజు)



హిందూస్థానీ సంగీతంలో ప్రసిద్ధి చెందిన సంగీతా కట్టి కులకర్ణి 1970 అక్టోబరు 7న ధారవాడలో జన్మించారు. బాల్యం నుంచే సంగీతంపై ఆసక్తితో రాణించారు. ప్రత్యేకించి గాత్ర సంగీతంతోపాటు భజనలు, వచనాలు, దాసవాణి, అభంగ్, జానపదం, భగవద్గీత సహా పలు భాషల్లో నేపథ్యగాయనిగా రాణించారు. ఆలిండియా రేడియో, టీవీలలోనూ 'ఏ' గ్రేడ్ కళాకారిణి. దేశవ్యాప్తంగా 700కుపైగా కచేరీలు నిర్వహించారు. సువర్ణ కర్ణాటక రాజ్యోత్సవ అవార్డు, ఇతర పురస్కారాలు అందుకున్నారు.

## ముడా వివాదంలో సిద్దరామయ్య పాత్ర లేదు



మీడియాతో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

**బంగారపేట, అక్టోబరు 6:** 'ముడా' వివాదంలో సీఎం సిద్దరామయ్య పాత్ర లేదని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ఎస్ఎన్ రిసార్టులో ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలసి మీడియాతో మాట్లాడారు. ఒక కరపత్రాన్ని సిద్ధం చేసి తాలూకాలోని ప్రతి గ్రామంలో పంచి ప్రజలలో ఆయనపై తప్పుడు భావాలను తొలగిస్తామన్నారు. సీఎంపై వచ్చిన ఆరోపణలను దూరం చేసేందుకు కరపత్రం ద్వారా అవగాహన కల్పించే తీర్మానం చేశామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఏం చేశారో, బీజేపీ పాలనలో జరిగిన అవినీతిని, జేడీఎస్ నేత కుమారస్వామి ఎంత ఆస్తి సంపాదించారో అవగాహన కల్పిస్తామన్నారు. మూడు అంశాలపై తాలూకాస్థాయిలో జాగృతి కల్పిస్తామన్నారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పార్థసారథి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాలగౌడ, పురసభ అధ్యక్షుడు గోవింద తదితరులు పాల్గొన్నారు.

## తాలూకా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు



ఐసొలేషన్‌వార్డు ప్రారంభంలో మంత్రి తదితరులు

**బాగేపల్లి, అక్టోబరు 6:** తాలూకా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం సాయంత్రం ఐసొలేషన్ వార్డు, ల్యాబరేటరిని ప్రారంభించి మాట్లాడుతూ ఆసుపత్రి కిందిభాగం అశాస్త్రీయంగా నిర్మించడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో ఆధునీకరించేందుకు ఎమ్మెల్యే ఎక్కువ గ్రాంట్లు కోరారన్నారు. వైద్యుల కొరత సమస్యను పరిష్కరిస్తామన్నారు. వచ్చే నెలలో కౌన్సెలింగ్ ద్వారా కంట్రాక్టు పద్ధతిన నియామకాలు చేపడతామన్నారు. కాగా తాలూకాలోని జీ మద్దేపల్లిలో సుమారు 5 కోట్ల రూపాయలతో ఆరోగ్యకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, జిల్లా అధికారి డాక్టర్ మహేశ్‌కుమార్, తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, గుడిబండ తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మైసూరు ఉత్సవాల్లో కోటిలింగేశ్వర శకటం




కోటి లింగేశ్వర ఆలయ శకట నమూనా

**బెంగళూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):** ప్రతిష్టాత్మక మైసూరు దసంరా ఉత్సవాలలో కీలకమైన జంబూసవారి ఊరేగింపులో కోలారు జిల్లా నుంచి కోటిలింగేశ్వర ఆలయ శకటం ఎంపికైంది. ఈమేరకు కోలారు జిల్లా అధికారి అక్రంపాషా మీడియాతో మాట్లాడుతూ కోలారు కోటి లింగేశ్వర, సోమేశ్వరస్వామి ఆలయాలు, ముళబాగిలులోని కురుడుమలె గణపతి ఆలయ శకటాలకు సంబంధించి మైసూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్పకు వివరించామన్నారు. వీటిలో కోటిలింగేశ్వర ఆలయ శకటాన్ని కమిటీ ఎంపిక చేసిందన్నారు. జిల్లా పరిశ్రమల సమాఖ్య డిప్యూటీ డైరెక్టర్ రవిచంద్ర నేతృత్వంలోని ఓ బృందం మైసూరులోనే మకాం వేసి శకటం రూపొందిస్తోందన్నారు. కాగా దసరా ఉత్సవాలలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు డాగ్ షో ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఫ్యాషన్‌షోలో అమ్మాయిలు ర్యాంప్ వాక్ చేశారు. కుస్తీ పోటీలు జరిగాయి.

### వివిధ రూపాల్లో అమ్మవారు

దసరా ఉత్స వాల్లో భాగంగా నాల్గోరోజు ఆదివారం అమ్మవారు పలు రూపాల అలంకరణలో భక్తులక దర్శనమిచ్చారు. బనశంకరి దేవి అమ్మవారికి పండ్ల అలంకరణ చేశారు. జామకాయ, అనారస్, బత్తాయి, బాదామి, సీతాఫలం తదితర పండ్లతో అలంకరించారు. కాగా గిరినగర్‌లోని వాసవీమాత బంగారు చీరలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

### శిడ్లఘట్టలో...

**శిడ్లఘట్ట :** పట్టణంలోని నగర్తపేటలోని మహేశ్వరి దేవి ఆలయంలో మండలపూజ, నవరాత్రి పూ జలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు హో మాల అనంతరం మహామంగళారతి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ జీర్ణోద్ధరణ నేపథ్యంలో 48రోజుల పాటు మండల పూజ కొనసాగించారు. అర్చకులు శ్రీనివాస్, సుబ్రమణిల నేతృత్వంలో కైంకర్యాలు కొనసాగాయి. విశేషపూజల్లో కాంగ్రెస్ ప్రముఖుడు రాజీవ్‌గౌడ, డీసీసీ బ్యాంకు ఉపాధ్యక్షుడు డాల్ఫిన్ నాగరాజ్, ఎం మంజునాథ్, జేఎం బాలకృష్ణ, అప్సర్‌పాష, జేజీ శివకుమార్, జేఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### రామమూర్తినగర్‌లో బొమ్మలకొలువు

దసరా పండుగంటే ఎన్నో విధాలా సంబరాలకు సంకేతం. ఆలయాలలో శక్తిదేవతలకు విశేష అలంకరణలు కొనసాగుతాయి. మరోవైపు సంప్రదాయంగా కొందరు బొమ్మలకొలువు ఏర్పాటు చేస్తారు. రామమూర్తినగర్‌లోని స్నేహా విశ్వాస్ ఇంట్లో 200 కు పైగా బొమ్మలతో కొలువు ఏర్పాటు చేశారు. స్నేహా విశ్వాస్ మీడియాతో మాట్లాడుతూ ఆరేళ్లగా కొలువు ఏర్పాటు చేస్తున్నామని ప్రతి సంవత్సరం ఓ ప్రత్యేకమైన నమూనాను ఎంచుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుతం దేవుడు బొమ్మలు, సంప్రదాయబొమ్మలతోపాటు వండర్‌లా అమ్యూజ్‌మెంట్ పార్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. గత ఏడాది జూ, అంతకుముందు గ్రామీణ సంప్రదాయం, తాజ్ మహల్, ఎయిర్‌పోర్ట్ వంటి రూపాలతో కొలువుదీర్చా మన్నారు. అమ్యూజ్‌మెంట్ పార్క్‌లోని అన్ని విభాగాలను పొందుపరిచామన్నారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, నైవేద్యం కొనసాగిస్తామన్నారు.

### అలరించిన నవరాత్రి నృత్యోత్సవం

దసరా ఉత్సవాల్లో భాగంగా నగరంలోని నయన సభాంగణంలో ఆర్ట్ కల్చరల్ ఎడ్యుకేషనల్ ఎన్‌లైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన నవరాత్రి నృత్యోత్సవం సభికులకు అలరించింది. వివిధ బృందాల నృత్య ప్రదర్శనలు కనుల పండువుగా కళాభి మా నులను ఆకట్టుకున్నాయి. ప్రధాన అతిథిగా ప్రఖ్యాత జ్యోతి ష్యులు ఆర్యవర్ధన్ గురూజీ, సృష్టి సంస్థ నిర్వాహకులు కమలా చంద్రశేఖర్, ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ అంబికా పాల్గొన్నారు. కార్యక్రమంలో దుర్గాదేవి, నవదుర్గ వేషధారణలతో మహిళలు, చిన్నారులు తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. వివిధ డ్యాన్స్ స్కూళ్లలో శిక్షణ పొందుతున్న వారు ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రత్యేకించి 'జయ జయహే మహిషాసుర మర్ధిని' నృత్యరూపకం సభికులను అలరించింది.





శిడ్లఘట్టలో మహేశ్వరీదేవి, గిరినగర్‌లో బంగారుచీర అలంకరణలో వాసవీమాత, దొడ్డజాల ముత్యాలమ్మదేవి



కుస్తీ పోటీలో ఓ సన్నివేశం



రామమూర్తినగర్‌లో దసరా బొమ్మల కొలువు



మైసూరు ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శన




నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాబృందం

# సముద్రపు అంబులెన్స్‌ల కొనుగోలుకు మత్స్యశాఖ టెండర్లు

**బెంగళూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):** కర్ణాటక పరిధిలోని దక్షిణకన్నడ, ఉత్తర కన్నడ, ఉడుపి జిల్లాల పరిధిలో సుదీర్ఘ సముద్రతీరంలో అత్యవసర సంఘటనల్లో సేవలందించేందుకు మూడు అంబులెన్స్‌లను కొనుగోలు చేసేందుకు టెండర్లను ఆహ్వానించింది. సముద్రం మధ్యలో ఇరుక్కున్న మత్స్యకారులు లేదా పర్యాటకులను రక్షించేందుకు బోట్ అంబులెన్స్‌లు ఉండాలనే డిమాండ్ కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉంది. ఈమేరకు 3 సీ అంబులెన్స్‌లను కొనుగోలు చేసేందుకు 7 కోట్ల రూపాయలతో టెండర్ ఆహ్వానించారు. మత్స్యకారులు వేటకు వెళ్లినప్పుడు సమస్యలు ఎదుర్కొంటే ఒడ్డుకు చేరుకునేలోపే ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని మత్స్యకారులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి అంబులెన్స్‌లోనూ ఐదుమంది రోగులకు చికిత్సలు అందించే సౌలభ్యం ఉంటుంది. అత్యవసర వైద్య పరికరాలు ఈసీజీ, వెంటిలేషన్, పల్స్ ఆక్సీమీటర్‌లు, ఆక్సిజన్ సిలిండర్ వంటి సౌలభ్యాలు ఉంటాయి. ఈ మేరకు మత్స్యకారుల సంరక్షణ సమితి అధ్యక్షుడు జయా సీ కోట్యాన్ మాట్లాడుతూ ఆరేడేళ్లుగా ప్రతిపాదనలు ఉండేవని ప్రస్తుతాని టెండర్లదాకా ప్రక్రియ సాగిందన్నారు. ప్రతి జిల్లా పరిధిలో ఒక అంబులెన్స్ ఉంటుందని వైద్య సహాయకులు నిరంతరంగా అందుబాటులో ఉంటారన్నారు.




సీ అంబులెన్స్ (ఫైల్)

## ఐటీ ఉద్యోగులకు 14 గంటల పని

» అభిప్రాయ సేకరణలో కార్మికశాఖ.. రేపు ప్రత్యేక సదస్సు

**బెంగళూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):** ఐటీ బీటీ కంపెనీలలో ఉద్యోగుల పనిగంటల పరిధిని 14 గంటలకు విస్తరింపచేయాలనే పారిశ్రామికవేత్తలు సూచించిన విషయం తెలిసిందే. ఇదే విషయమై కార్మికశాఖ అభిప్రాయసేకరణకు సిద్ధమైంది. కార్మికసంఘాలతో చర్చలకు సిద్ధమైంది. పనిగంటలను విస్తరింపచేయడం ద్వారా జరిగే లాభనష్టాలపై కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల అభిప్రాయాలను సేకరించనున్నారు. ఐటీబీటీ రంగాలలో పని గంటల విస్తరణకు తీవ్రమైన వ్యతిరేకత ఉంది. 8 గంటలనుంచి ఏకంగా 12 గంటలకు పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం మరో రెండుగంటలు అధికం చేస్తే జీవనశైలిపై పెను ప్రభావం చూపనుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పని ఒత్తిడి కారణంగా ఇతరత్రా ప్రభావాలు చూపుతాయని పలువురు ఐటీ నిపుణులు మండిపడుతున్నారు. వృత్తి, వ్యక్తిగత జీవనానికి తగిన సమయం ఉండాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మనిషికి ఉద్యోగం ఎంత ముఖ్యమో, వ్యక్తిగత జీవనం కూడా అంతే ముఖ్యమని ఇప్పటికే పలువురు ఐటీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. పనిగంటలు పెంచితే వారానికి నాలుగు రోజులకే కుదించాలనే ప్రతిపాదనలు వస్తున్నాయి. ఈనెల 8న 14 గంటల విస్తరణకు సంబంధించి కిద్వాయ్ ఆసుపత్రి సమీపంలోని స్త్రీ శిశుసంక్షేమశాఖ సభాంగణంలో కార్మిక చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్మికశాఖ కమిషనర్ డాక్టర్ హెచ్ఎన్ గోపాలకృష్ణ, కార్మిక సంక్షేమమండలి సీఈఓ భారతి, కార్మికశాఖ అదనపు కమిషనర్ డాక్టర్ జీ మంజునాథ్, డైరెక్టర్ శ్రీనివాస్, జాయింట్ కమిషనర్‌లు రవికుమార్, చిదానంద, డిప్యూటీ స్పీకర్ సోమణ్ణలు పాల్గొననున్నారు. అభిప్రాయాలు ఏ విధంగా వస్తాయో వేచి చూడాలి.

## జేడీఎస్ అధికారంలోకి వస్తే చన్నపట్టణ, రామనగర జంటనగరాలు




కేంద్రమంత్రి కుమారస్వామి

**బెంగళూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):** రానున్న రోజుల్లో జేడీఎస్ అధికారంలోకి వస్తే చన్నపట్టణ, రామ నగరలను జంట నగరాలు చేస్తామని కేంద్ర మంత్రి కు మారస్వామి ప్రకటించారు. ఆదివారం చన్నపట్టణ పరిధి లోని కోడంబళ్ళిలో జేడీఎస్ కార్యకర్తల సమావేశం జరి గింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ నాకు జేడీఎస్ పార్టీ ద్వారానే ఐదేళ్ల ప్రభుత్వం కొనసాగించా లనే లక్ష్యం ఉందన్నారు. పూర్తిస్థాయి మెజారిటీ వస్తే హుబ్బళ్ళి-ధారవాడ తరహాలోనే చన్నపట్టణ-రామనగరలను జంట నగరాలుగా తీరుస్తానన్నారు. 14 నెలలు సీఎంగా నీటి ప్రాజెక్టులను తీసుకొచ్చానన్నారు. ఆ తర్వాత అధికారం నుంచి దూరం చేశారన్నారు. కుమార స్వామిని రాజకీయాలనుంచి తప్పించామని కొందరు సంబరుపడ్డారని అయితే ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేబినెట్‌లో మంత్రిగా వ్యవహరిస్తున్నా అన్నారు. జేడీఎస్ పార్టీ ఎప్పటికీ ఎవరూ ముగించలేరన్నారు. చన్నపట్టణ నుంచి ఎవరు పోటీ చేయాలనేది త్వరలోనే స్పష్టత వస్తుందన్నారు.

## బ్యాటరీల మన్నికతోనే వాహనాలకు ఆదరణ

**బెంగళూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):** దేశవ్యాప్తంగా ఎలక్ట్రికల్ వాహనాల వాడకంపై ఆసక్తి పెరుగుతోందని అందుకు అనుగుణంగానే బ్యాటరీల మన్నిక సాధ్యం చేస్తే ఎక్కువమంది ఆదరిస్తారని బ్యాటరీ స్మార్ట్ వైస్‌ప్రెసిడెంట్ అనుశ్రీ భట్టాచార్య అభిప్రాయపడ్డారు. ఈమేరకు వారివో మోటార్స్ బ్యాటరీ స్మార్ట్ సంస్థలు ఒప్పందం చేసుకున్నట్టు అనుశ్రీ ప్రకటించారు. ఈ మేరకు నగరంలో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైస్పీడ్ ఎలక్ట్రికల్ స్కూటర్‌లను వారివో మోటార్స్ మార్కెట్‌లోకి తీసుకొచ్చిందని, అయితే బ్యాటరీ స్మార్ట్ ఒప్పంద తర్వాత వినియోగదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారన్నారు. 2025 చివరకు బ్యాటరీ స్మార్ట్ సంస్థ బ్యాటరీ - స్వాపింగ్ టెక్నాలజీతో 20వేలకుపైగా ఎలక్ట్రికల్ స్కూటర్‌లను తీసుకురాదలిచిందన్నారు. వారివో మోటార్స్ డైరెక్టర్ యువరాజ్ గార్గ్ అభిప్రాయం మేరకు బ్యాటరీ స్మార్ట్‌తో ఒప్పందం సంతోషకరమని, తమ వాహనాలు ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలకు విస్తరింప చేయదలిచామన్నారు.

## పరిహార క్రియాపూజల్లో కేంద్రమంత్రి సోమణ్ణ

**బెంగళూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):** మెజస్టిక్‌లోని శబరిమలై అయ్యప్ప ఆలయంలో జరిగిన పరిహార క్రియాపూజా కార్యక్రమాల్లో కేంద్రమంత్రి సోమణ్ణ పాల్గొన్నారు. శబరిమలై ప్రధాన ఆలయ అర్చకుడు కంటారు రాజీవరు తంత్రి నేతృత్వంలో ఆదివారం పూజలు జరిగాయి. పరిహారక్రియా పూజలు శనివారం ఆరంభమయ్యాయి. మహామృత్యుంజయ హోమం, సుదర్శన హోమాలు జరిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకే అష్టద్రవ్య మహాగణపతి హోమం, కళశాభిషేకం జరిపారు. కేంద్రమంత్రి సోమణ్ణ పూజల్లో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందారు. ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో కేంద్రమంత్రి సోమణ్ణ

## చెరువులను అభివృద్ధి చేస్తాం

**మహదేవపుర, అక్టోబరు 6:** ప్రజల అనుకూలం కోసం చెరువులను అభివృద్ధి చేసి అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి తెలిపారు. నియోజకవర్గంలోని దొడ్డగుబ్బి గ్రామపంచాయతీలోని రాంపురలో ఏర్పాటు చేసిన గ్రామసభను ప్రారంభించి మాట్లాడారు. ఇదివరకు ఎమ్మెల్యేగా వ్యవహరించిన అరవింద లింబావళి మార్గదర్శకంలో నియోజకవర్గ అభివృద్ధికి పలు పథకాలు రూపొందించారన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధికి పాటుపడతామన్నారు. వివిధ పథకాల లబ్ధిదారులైన దివ్యాంగులకు వీల్‌చెయిర్‌లు, క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్ సామగ్రి, అంగన్‌వాడీ కార్యకర్తలకు చెక్కులు అందచేశారు. కార్యక్రమంలో తాలూకా పంచాయతీ ఈఓ వసంతకుమార్, దొడ్డగుబ్బి గ్రామపంచాయతీ అధ్యక్షుడు చంద్రప్ప, మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షురాలు అంబికా మంజునాథ, పీడీఓ రోహిత్, స్థానిక బీజేపీ నాయకులు తది తరులు పాల్గొన్నారు. .



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మంజుల

## సాగు అభివృద్ధికి సాంకేతికత దోహదపడాలి

**దొడ్డబళ్ళాపుర, అక్టోబరు 6:** ఆధునిక సాగులో సాంకేతికత దోహదపడాలని వ్యవసాయ శాఖ సహాయక డైరెక్టర్ రాఘవేంద్ర అభిప్రాయపడ్డారు. మందుల పిచికారీ ఇతరత్రా పనులకు డ్రోన్ వంటి సాంకేతిక విధానాలు పాటించడం ద్వారా సాగులో దిగుబడి పెంచుకోవాలన్నారు. తాలూకాలోని సొణ్ణప్పనహళ్ళిలో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డ్రోన్ వాడకంపై ప్రత్యేక అవగాహన కల్పిం చారు. జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తి పెరగాల్సి ఉందన్నారు. ఇటీవలి కాలంలో వ్యవసాయ కూలీల కొరత అధికంగా ఉందని దీన్ని అధిగమించేందుకు డ్రోన్ ఎంతో సహకారి కానుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత డాక్టర్ వెంకటేగౌడ మాట్లాడుతూ పంటలకు అవసరమైన మేరకు మాత్రమే రసాయన ఎరువులు, యూరియా వాడాలన్నారు. ఇఫ్కో సంస్థ చేతన్ మాట్లా డుతూ న్యానో యూరియా వాడకంతో రైతుల ఖర్చు తక్కువ కానుందన్నారు. కొన్నఘట్ట గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు మంగళ, సభ్యులు ప్రభాకర్, ఇఫ్కో సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



డ్రోన్ ద్వారా పిచికారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## సీపీఎం పోస్టర్ల విడుదల

**బాగేపల్లి, అక్టోబరు 6:** తాలూకాలోని కొండంవారిపల్లిలో నవంబరు 21, 22 తేదీలలో సీపీఎం 18వ జిల్లా సమ్మేళనం జరగనుంది. ఇందుకు సంబంధించి లోగోను సీపీఎం రాష్ట్ర సమితి సభ్యుడు డాక్టర్ అనిల్‌కుమార్ ఆదివారం విడుదల చేశారు. పట్టణంలోని సుందరయ్య సభాంగణంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఎం జిల్లా సమ్మేళనం నేపథ్యంలో శాఖల స్థాయిలో సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిసెంబరులో రాష్ట్రస్థాయి సమ్మేళనం, 2025 ఏప్రిల్‌లో అఖిలభారత సమ్మేళనం ఉంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా కళాజాతాలు సంచరిస్తాయన్నారు. 200కుపైగా వీధుల్లో సభలు నిర్వహించి ప్రజలను చైతన్యం తెస్తామన్నారు. జిల్లా సమ్మేళనం స్వాగత సమితి అధ్యక్షుడు సిద్దగంగప్ప, కార్యదర్శి మునివెంకటప్ప, మునికృష్ణప్ప, ఎంఎస్ రఘురామరెడ్డి పాల్గొన్నారు.



లోగో విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు